సాక్షి అనకాపల్లి

మంగళవారం ၊ 26 ၊ డిసెంబర్ ၊ 2023



మార్గశిర మాసోత్సవాలు

విశాఖ కనకమహాలక్ష్మి ఆలయంలో మార్గశిర మాసోత్సవాలు కనులపండువగా జరుగుతున్నాయి. 8లో



వైభవంగా శోభాయాత్ర

భీమిలి: అయోధ్య రామమందిరానికి స్వామి వారి అక్షింతల శోభా యాత్ర సోమవారం వైభవంగా నిర్వహించారు. 8లో



శ్రీరాముడిగా అప్పన్న

సింహగిరిపై జరుగుతున్న రాపత్తు ఉత్సవాల్లో భాగంగా సోమవారం శ్రీవరాహ లక్ష్మీనృసింహస్వామి రామాలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. 8లో

ఇలపై కరుణ కిరణం

- జిల్లా వ్యాప్తంగా ఘనంగా క్రిస్మస్ వేడుకలు
- కిటకిటలాడిన చర్చిలు
- ప్రార్థనల్లో తరించిన విశ్వాసులు

సాక్షి నెట్‌వర్క్: కరుణామయుడైన ఏసుక్రీస్తు బాలయేసుగా భూమిపై అవతరించిన వేళ.. విశ్వాసుల హృదయాలు భక్తిభావంతో నిండిపోయాయి. స్టార్లు కాంతులీనాయి. క్రిస్మస్ సంబరాలు అంబరాన్నంటాయి. క్రైస్తవులందరూ సాంస్కృతిక కార్యక్రమాలు, ఆటపాటలతో ఉత్సాహంగా గడిపారు. విద్యుత్ దీపాల అలంకరణతో చర్చిలన్నీ శోభిల్లాయి. ఆదివారం అర్ధరాత్రి నుంచి సోమవారం మధ్యాహ్నం వరకు ప్రార్థనా మందిరాలు భక్తులతో కిటకిటలాడాయి. నూతన దుస్తులు ధరించి హ్యాపీ క్రిస్మస్.. మెర్రీ క్రిస్మస్ అంటూ పరస్పరం శుభాకాంక్షలు అందజేసుకున్నారు. బిషప్‌లు, పాస్టర్లు, దైవ సందేశం వినిపించారు. ఏసు మార్గంలో నడవాలని సూచించారు. చాలా చర్చిల్లో పేదలకు దుస్తులు పంపిణీ చేశారు. దేవరాపల్లి మండలం కాశీపురం చర్చిలో ఉప ముఖ్యమంత్రి బూడి ముత్యాలనాయుడు కేక్ కట్ చేసి చిన్నారికి కేక్ తినిపించారు. రోలుగుంట, మాడుగులలోని ఆర్‌సీఎం చర్చిల్లో చిన్నారులు కేక్ కట్ చేశారు. రావికమతం మండలం కొత్తకోట ఆర్‌సీఎం చర్చి, రాంబిల్లి మండలం కొత్తపేట చర్చిలో, ఇంకా అనకాపల్లి, చీడికాడ తదితర మండలాల్లో క్రైస్తవులు ప్రార్థనల్లో మునిగిపోయారు.



రోలుగుంట: ఆర్‌సీఎం చర్చిలో ఫాదర్ సమక్షంలో కేక్ కట్ చేస్తున్న చిన్నారులు



మాడుగుల: ఆర్‌సీఎం చర్చిలో బాల ఏసు అవతరించిన దృశ్యం



దేవరాపల్లి: కాశీపురం చర్చిలో చిన్నారికి కేక్ తినిపిస్తున్న డిప్యూటీ సీఎం బూడి



కశింకోట: జమాదులపాలెంలో క్రిస్మస్ వేడుకల్లో పాల్గొన్న మంత్రి అమర్‌నాథ్



రాంబిల్లి: కొత్తపేట చర్చిలో ప్రార్థనలు

30న నర్సీపట్నంలో సామాజిక సాధికార యాత్ర



సాధికార యాత్రపై పార్టీ నాయకులు, అధికారులకు సూచనలిస్తున్న ఎమ్మెల్యే ఉమాశంకర్ గణేష్

నర్సీపట్నం: ఈ నెల 30న నర్సీపట్నంలో జరగనున్న సామాజిక సాధికార యాత్రకు పటిష్ట ఏర్పాట్లు చేస్తున్నట్లు ఎమ్మెల్యే పెట్ల ఉమాశంకర్ గణేష్ తెలిపారు. సాధికార యాత్ర బహిరంగ సభ జరగనున్న అబిద్ సెంటర్‌ను పార్టీ నాయకులు, అధికారులతో కలిసి సోమవారం ఆయన పరిశీలించారు. సభాస్థలి ఏర్పాటు, యాత్రకు తరలివచ్చే వరకు పార్టీ శ్రేణులకు ఇబ్బందులు తలెత్తకుండా తగు ఏర్పాట్లు చేయాలని అధికారులను, పార్టీ నాయకులను సూచించారు. నియోజకవర్గంలోని నాలుగు మండలాల నుంచి వేల సంఖ్యలో వచ్చే పార్టీ అభిమానుల కోసం పూర్తి స్థాయిలో ఏర్పాట్లు చేయాలన్నారు. అన్ని గ్రామాల నుంచి ప్రజాప్రతినిధులు, లబ్ధిదారులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు, ఎంపీపీలు, జెడ్పీటీసీలు, కౌన్సిలర్లు, కోఆప్షన్ సభ్యులు, సర్పంచ్‌లు, జేసీఎస్ కన్వీనర్లు సదస్సుకు హాజరుకావాలని పిలుపునిచ్చారు. సభ నేపథ్యంలో అబిద్ సెంటర్‌లో ట్రాఫిక్‌కు ఇబ్బంది లేకుండా ఏర్పాట్లు చేయాలని పోలీసులను సూచించారు. ఎమ్మెల్యే వెంట మున్సిపల్ వైస్ చైర్మన్ కోనేటి రామకృష్ణ, పార్టీ టౌన్ అధ్యక్షుడు ఏకా శివ, మున్సిపల్ సచివాలయాల కన్వీనర్ తమరాన శ్రీను, మున్సిపల్ ఇంజినీరింగ్ అధికారులు ఉన్నారు.

న్యూస్‌రీల్

నేడు గవర్నర్ రాక



మహారాణిపేట: గవర్నర్ ఎస్.అబ్దుల్ నజీర్ మంగళవారం విశాఖ వస్తున్నారు. వందే భారత్ ఎక్స్‌ప్రెస్‌లో రాత్రి 11.35 గంటలకు విశాఖ రైల్వే స్టేషన్‌కు చేరుకుంటారు. రైల్వే స్టేషన్ నుంచి గవర్నర్ నేరుగా నొవోటెల్ హోటల్‌కు వెళతారు. బుధవారం కూడా అదే హోటల్‌లో బస చేస్తారు. గురువారం ఉదయం 11 గంటల నుంచి 12.30 గంటల వరకు ఏయూ కన్వెన్షన్ సెంటర్‌లో వికసిత్ భారత్ సంకల్ప యాత్ర కార్యక్రమంలో పాల్గొంటారు. అక్కడ నుంచి నేరుగా నొవోటెల్ హోటల్‌కు చేరుకొని అక్కడ బస చేస్తారు. శుక్రవారం మధ్యాహ్నం 1.10 గంటలకు అమరావతి ఎక్స్‌ప్రెస్‌లో విజయవాడ వెళతారు.

నూకాంబిక సన్నిధిలో జస్టిస్ ప్రియదర్శిని



జస్టిస్ ప్రియదర్శినికి అమ్మవారి చిత్రపటాన్ని అందిస్తున్న ఆలయ ఈవో బండారు ప్రసాద్

అనకాపల్లి: గవరపాలెం నూకాంబిక అమ్మవారిని తెలంగాణ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ ఎం.జి.ప్రియదర్శిని సోమవారం దర్శించుకున్నారు. ఆలయ కార్యనిర్వహణాధికారి బండారు ప్రసాద్, అర్చకులు సాదర స్వాగతం పలికి అమ్మవారి దర్శనం చేయించారు. ఆలయ బేడా మండపంలో ఆమెకు ఈవో ప్రసాద్, వైఎస్సార్‌సీపీ యువనేత దాడి జయవీర్ అమ్మవారి చిత్రపటాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

జిల్లాస్థాయి వైజ్ఞానిక ప్రదర్శన నేడు

అనకాపల్లి: స్థానిక జీవీఎంసీ పెద్దహైస్కూల్ ఆవరణలో మంగళవారం ఉదయం 10 గంటలకు జిల్లా స్థాయి సైన్స్ ఫేర్(వైజ్ఞానిక ప్రదర్శన) ప్రారంభించనున్నట్లు డీఈవో ఎం.వెంకటలక్ష్మమ్మ సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. మండల స్థాయి ప్రదర్శనలో ఉత్తమంగా నిలిచిన మండలానికి మూడు చొప్పున మొత్తం 72 సైన్స్ ప్రాజెక్టులను జిల్లా స్థాయికి ఎంపిక చేసినట్లు పేర్కొన్నారు. జిల్లాస్థాయి పోటీల్లో ఉత్తమంగా నిలిచిన తొమ్మిది ప్రాజెక్టులను రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక చేస్తామన్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా కలెక్టర్ రవి పట్టాన్‌శెట్టి, రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్య, ఐటీశాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్, ఎంపీ బీవీ సత్యవతి విచ్చేయనున్నట్లు వెల్లడించారు.

కేజీహెచ్‌లో 11 వాటర్ కూలర్ల ఏర్పాటు



రోగుల కోసం ఏర్పాటు చేసిన వాటర్ కూలర్లు

మహారాణిపేట: కేజీహెచ్‌లో 11 వాటర్ కూలర్లను ఏర్పాటు చేశారు. కలెక్టర్ మల్లికార్జున ఆదేశాల మేరకు దివ్యాంగులు, విభిన్న ప్రతిభావంతులు, వయోవృద్ధుల సంక్షేమ శాఖ నిధులు రూ.30లక్షలతో కేజీహెచ్‌లో వీటిని ఏర్పాటు చేశారు. సోమవారం కేజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ పి.అశోక్ కుమార్, ఆంధ్రప్రదేశ్ వైద్య ఆరోగ్య మౌలిక సదుపాయాల సంస్థ ఎగ్జిక్యూటివ్ ఇంజినీరు డీవీ నాయుడు, డీఈఈ మన్మథరావు తదితరులు వీటిని పరిశీలించారు.

ఐఎన్‌ఎస్ ఘారియల్‌లో ఎన్‌సీసీ క్యాడెట్లు



ఎన్‌సీసీ క్యాడెట్లకు నౌకలో ఫైర్‌ఫైటింగ్‌పై శిక్షణ ఇస్తున్న నేవీ సిబ్బంది

విశాఖ సిటీ: రెండు వారాల సముద్ర శిక్షణలో భాగంగా దేశంలో ఉన్న 59 మంది ఎన్‌సీసీ క్యాడెట్లకు ఐఎన్‌ఎస్ ఘారియల్ నౌకలో నేవీ అధికారులు శిక్షణ ఇచ్చారు. ఇందులో సెయిలింగ్, ఫైర్ ఫైటింగ్, డ్యామేజ్ కంట్రోల్, చిన్న ఆయుధాలపై శిక్షణ అందించారు. అలాగే నేవల్ డాక్‌యార్డ్‌ను, అందులో పలు నౌకలను సందర్శించారు. నావికాదళ కార్యకలాపాలను తెలుసుకున్నారు.

ఆటకు సై



- నేటి నుంచి ఆడుదాం ఆంధ్రా పోటీలు
- ఏర్పాట్లు పూర్తి చేసిన యంత్రాంగం

చోడవరం, దేవరాపల్లి: క్రీడా ప్రతిభను గుర్తించడంతో పాటు మట్టిలో మాణిక్యాలను వెలుగులోకి తీసుకురావడమే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం 'ఆడుదాం ఆంధ్రా' అనే భారీ కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. గ్రామ నుంచి రాష్ట్ర స్థాయి వరకు ఐదు క్రీడాంశాల్లో ఈ పోటీలు జరగనున్నాయి. 15 ఏళ్ల నిండి.. రిజిస్ట్రేషన్ చేసుకున్న ప్రతి ఒక్కరూ తలపడే ఈ టోర్నీలో తొలి రెండు స్థాయిల్లో గ్రామ పంచాయతీ/వార్డు మొదలుకుని మండల స్థాయి వరకు క్రికెట్, వాలీబాల్, బ్యాడ్మింటన్‌లతో పాటు గ్రామీణ క్రీడలైన ఖోఖో, కబడ్డీ పోటీలు జరగనున్నాయి. ఈ స్థాయిలో ఆడేందుకు పూర్తి స్థాయిలో నియమ నిబంధనలు తెలియకపోయినా.. ఆట స్వరూపం తెలిసి ఉంటే చాలు. ఇక పూర్తి నియమ నిబంధనలతో నియోజకవర్గ, జిల్లా, రాష్ట్ర స్థాయిలో పోటీలు నిర్వహించి.. ఈ మూడు స్థాయిల్లో సత్తా చాటిన వారికి భారీగా నగదు ప్రోత్సాహకాలను అందించనున్నారు. ఇక్కడ సత్తా చాటే క్రీడాకారులను ఉన్నత స్థాయి శిక్షణకు ఎంపిక చేయనున్నారు. గ్రామ స్థాయి నుంచి ఆడుతూ ముందుకు సాగే ఈ టోర్నీ ఈనెల 26న ప్రారంభమై ఫిబ్రవరి 10వ తేదీతో ముగియనుంది. జిల్లాలోని 24 మండలాల్లోని పాఠశాలల మైదానాల్లో గ్రామ స్థాయి పోటీలు నిర్వహించేందుకు జిల్లా యంత్రాంగం ఏర్పాట్లు చేసింది.

దేవరాపల్లిలో డిప్యూటీ సీఎం చేతుల మీదుగా..

ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న 'ఆడుదాం ఆంధ్రా' కార్యక్రమాన్ని దేవరాపల్లిలో ఉప ముఖ్యమంత్రి బూడి ముత్యాలనాయుడు మంగళవారం ప్రారంభించనున్నారు. స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఉదయం 10 గంటలకు క్రీడా పోటీలను డిప్యూటీ సీఎం ప్రారంభిస్తారని, రిజిస్ట్రేషన్ చేసుకున్న క్రీడాకారులంతా హాజరు కావాలని ఎంపీడీవో సిహెచ్. సుబ్బలక్ష్మి సూచించారు.

మట్టిలో మాణిక్యాలను వెలికితీయడమే లక్ష్యం

క్రీడాకారులను ప్రోత్సహించి, వారికి మంచి భవిష్యత్ అందించాలన్న ఆశయంతోనే ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ఆడుదాం... ఆంధ్రా క్రీడాపోటీలు నిర్వహిస్తున్నారని ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ అన్నారు. చోడవరం పార్టీ కార్యాలయంలో సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ఈనెల 26వ తేదీ నుంచి సచివాలయాల వారీగా జరగనున్న ఆడుదాం...ఆంధ్రా క్రీడా పోటీల్లో అందరూ భాగస్వాములు కావాలని ఆయన పిలుపునిచ్చారు. గ్రామ స్థాయిలో క్రీడలపై ఆసక్తి ఉన్న యువతీ, యువకులు ఈ పోటీల్లో పాల్గొని తమ ప్రతిభ చూపితే మండలస్థాయి, నియోజకవర్గ, జిల్లా, రాష్ట్ర స్థాయికి ఎంపిక చేయడం జరుగుతుందన్నారు. ఇప్పటికే ఈ పోటీలకు సంబంధించిన షెడ్యూల్‌ను సచివాలయాల వారీగా ఇవ్వడంతో పాటు ఆటలు ఆడించేందుకు కమిటీలను కూడా నియమించామన్నారు.

ఇదీ షెడ్యూల్

- ఈ నెల 26 నుంచి ఫిబ్రవరి 10 వరకు పోటీల నిర్వహణ
- వార్డు/గ్రామ సచివాలయ పరిధిలో ఈనెల 26 నుంచి జనవరి 9 వరకు
- మండల స్థాయిలో జనవరి 10 నుంచి 23 వరకు
- నియోజకవర్గ స్థాయిలో జనవరి 24 నుంచి 30 వరకు
- జిల్లా స్థాయిలో జనవరి 31 ఫిబ్రవరి 5 వరకు
- రాష్ట్ర స్థాయిలో ఫిబ్రవరి 6 నుంచి 10వ తేదీ వరకు

క్రీడాంశాలు : క్రికెట్, బ్యాడ్మింటన్, వాలీబాల్, కబడ్డీ, ఖోఖో



మాట్లాడుతున్న ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ

క్రికెట్, వాలీబాల్, కబడ్డీ, ఖోఖో విజేతలకు బహుమతులు ఇలా..

స్థానం	అసెంబ్లీ స్థాయి	జిల్లాస్థాయి	రాష్ట్రస్థాయి
ప్రథమ	రూ.35 వేలు	రూ.60 వేలు	రూ.5 లక్షలు
ద్వితీయ	రూ..15 వేలు	రూ.30 వేలు	రూ.3 లక్షలు
తృతీయ	రూ.5 వేలు	రూ. 10 వేలు	రూ.2 లక్షలు

బ్యాడ్మింటన్ విజేతలకు బహుమతులు ఇలా..

స్థానం	అసెంబ్లీ స్థాయి	జిల్లాస్థాయి	రాష్ట్రస్థాయి
ప్రథమ	రూ.20 వేలు	రూ.35 వేలు	రూ.2 లక్షలు
ద్వితీయ	రూ.10 వేలు	రూ.20 వేలు	రూ. లక్ష
తృతీయ	రూ.5 వేలు	రూ. 10 వేల	రూ.50 వేలు

తాచేరు డైవర్షన్ రోడ్డుపై రాకపోకలకు అనుమతి

పనులను పరిశీలించిన ప్రభుత్వ విప్ ధర్మశ్రీ



పేటలో తాచేరు డైవర్షన్ రోడ్డు పనులను పరిశీలిస్తున్న విప్ ధర్మశ్రీ

బుచ్చెయ్యపేట: బుచ్చెయ్యపేట మండలం విజయరామరాజుపేట వద్ద డైవర్షన్ రోడ్డు మీదుగా రాకపోకలు ప్రారంభమయ్యాయి. ఈ నెల 18న భీమునిపట్నం, నర్సీపట్నం రోడ్డులో విజయరామరాజుపేట వద్ద బ్రిటీష్ కాలం నాటి తాచేరు వంతెన కూలిపోయిన విషయం తెలిసిందే. దీంతో విశాఖ, అనకాపల్లి, పాడేరు, నర్సీపట్నం, చోడవరం, మాడుగుల తదితర రహదారుల్లో ఆర్టీసీ బస్సులు, ఇతర వాహనాల రాకపోకలు నిలిచిపోయాయి. ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ చొరవతో డైవర్షన్ రోడ్డు ఏర్పాటు, వంతెన నిర్మాణానికి ప్రభుత్వం రూ.5.5 కోట్లు మంజూరు చేసింది. ఈ నిధులతో వంతెన నిర్మాణ పనులు చేపట్టాలని ఆర్ అండ్‌బీ డీఈ రమేష్‌ను విప్ ధర్మశ్రీ ఆదేశించారు. ముందుగా ఆర్అండ్‌బీ అధికార్లు డైవర్షన్ రోడ్డు పనులను యుద్ధప్రాతిపదికన పూర్తి చేశారు. డైవర్షన్ రోడ్డును మండల నాయకులతో కలిసి విప్ ధర్మశ్రీ సోమవారం పరిశీలించారు. ప్రమాదాలు జరగకుండా రాకపోకలు సాగేలా చూడాలని ఆర్ అండ్‌బీ అధికారులను, పోలీసులను సూచించారు. మరోవైపు వంతెన నిర్మాణ పనుల్ని త్వరితగతిన పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. సోమవారం సాయంత్రం నుంచి డైవర్షన్ రోడ్డు మీదుగా పాదచారుల రాకపోకలు జరిగేలా అధికారులు చర్యలు తీసుకున్నారు. మంగళవారం ఉదయం నుంచి వాహనాలను అనుమతిస్తారు. ధర్మశ్రీ వెంట జెడ్పీటీసీ దొండా రాంబాబు, వైస్ ఎంపీపీ దొండా లలితా నారాయణమూర్తి, సర్పంచ్ విజయ్‌కుమార్, కోఆపరేటివ్ అధ్యక్షుడు గోవింద తదితర్లు ఉన్నారు.

విద్యార్థుల ప్రాణాలు కాపాడిన శివకు సన్మానం



శివను సత్కరిస్తున్న బాలల సంరక్షణ కేంద్ర ప్రతినిధులు

తగరపువలస: గత నెల 22న నగరంలో స్కూల్ ఆటోను లారీ ఢీకొన్న ప్రమాదంలో స్పందించి విద్యార్థులను కాపాడిన జీవీఎంసీ భీమిలి జోన్ వాటర్ వర్క్స్ కార్మికుడు వై.శివను సోమవారం సాయంత్రం భీమిలి మండలం తాళ్లవలస భరోసా లవ్ ఫర్ హ్యూమానిటీ లిటిల్ హగ్స్ బాలల సంరక్షణ కేంద్రంలో నిర్వాహకులు సత్కరించారు. కేంద్రంలో క్రిస్మస్ వేడుకల్లో భాగంగా జాతీయ వినియోగదారుల హక్కుల కమిషన్ జడ్జి సూర్య భాస్కరం ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. వినియోగదారుల సంరక్షణ చట్టంపై అవగాహన కలిగించారు. అనంతరం కేక్ కట్ చేసి సన్మాన గ్రహీతకు బుద్ధుని విగ్రహం బహూకరించారు. కార్యక్రమంలో వెంపాడ వెల్ఫేర్ సొసైటీ అధ్యక్షుడు వెంపాడ శ్రీనివాసరెడ్డి, సంరక్షణ కేంద్రం నిర్వాహకుడు అట్టాడ అవినాష్ తదితరులు పాల్గొన్నారు.

సందడిగా పర్యాటక కేంద్రాలు



పాల సముద్రాన్ని తలపిస్తున్న మేఘాలు



చాపరాయిలో పర్యాటకుల తాకిడి

అరకులోయ రూరల్/డుంబ్రిగుడ/అనంతగిరి: జిల్లాలో పర్యాటక కేంద్రాలకు సోమవారం సందర్శకులు పోటెత్తారు. రోజంతా ఉత్సాహంగా..ఉల్లాసంగా గడిపారు. అరకులోయ సమీపంలో గల మాడగడ సన్ రైజ్ వ్యూపాయింట్‌కు పర్యాటకుల తాకిడి భారీగా పెరిగింది. కుటుంబ సమేతంగా సందర్శకులు వచ్చి ఉల్లాసంగా గడిపారు. ట్రాఫిక్ జామ్ అవడంతో కిలోమీటరు మేర వాహనాల రాకపోకలు నిలిచిపోయాయి. డుంబ్రిగుడ మండలం చాపరాయి జలపాతానికి భారీగా సందర్శకులు వచ్చారు. ఉల్లాసంగా జలకాలాడారు. అరకు-పాడేరు ప్రధాన మార్గంలో ఉన్న పొద్దుతిరుగుడు పూల తోటల్లో ఫొటోలు తీసుకున్నారు. అనంతగిరి మండలంలోని ప్రముఖ పర్యాటక కేంద్రమైన బొర్రాగుహలు పర్యాటకులతో సందడిగా మారింది. బొర్రాగుహలు తిలకించేందుకు పర్యాటకులు పెద్ద సంఖ్యలో తరలిరావడంతో గేటువలస నుంచి బొర్రా వరకు పర్యాటకులు వాహనాలతో రోడ్డు రద్దీగా మారింది. గత మూడు రోజులుగా టూరిస్ట్‌స్పాట్లన్నీ కళకళలాడుతున్నాయి. సోమవారం బొర్రాకు 10,800 మంది పర్యాటకులు వచ్చారని, ఆదాయం రూ.8.39లక్షలు వచ్చినట్టు బొర్రా యూనిట్ మేనేజర్ గౌరీశంకర్ తెలిపారు.

పాపికొండలకు పర్యాటకుల తాకిడి



పేరంటాలపల్లి శివాలయం వద్ద స్వామివారి దర్శనానికి వెళుతున్న పర్యాటకులు

వీఆర్‌పురం: క్రిస్మస్ సెలవులతో పాపికొండలకు పర్యాటకుల తాకిడి పెరిగింది. సోమవారం పోచవరం బోటు పాయింట్‌కు అధిక సంఖ్యలో పర్యాటకులు తరలివచ్చారు. మిచాంగ్ తుపాను ప్రభావంతో 20 రోజుల పాటు అధికారుల ఆదేశాల మేరకు బోటింగ్‌ను నిలిపివేశారు. కాగా గత వారం అధికారులు తిరిగి అనుమతినిచ్చారు. అయినా పర్యాటకులు అంతంతమాత్రంగానే ఉన్నారు. ఆది, సోమవారాలు సెలవు కావడంతో పర్యాటకులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. 14 బోట్లలో వెయ్యిమందికి పైగా పర్యాటకులు పాపికొండల సందర్శనకు వెళ్లినట్టు ఏపీటూరిజం కౌంటర్ అసిస్టెంట్ సీహెచ్.రాజేష్ తెలిపారు.పర్యాటకులు అధిక సంఖ్యలో తరలిరావడంతో బోటింగ్ పాయింట్ ,పేరంటాలపల్లి శివాలయం ప్రాంతాలు కిటకిటలాడాయి.

ఈ సర్పంచ్ వెరీ స్పెషల్

రాజకీయాన్ని సంపాదనకు మార్గం అనుకునే ప్రస్తుత రోజుల్లో ఓ సర్పంచ్ తీరు ఆదర్శంగా నిలిచింది. సరైన రోడ్డు సదుపాయం లేక గ్రామ ప్రజలు పడుతున్న ఇబ్బందుల్ని గమనించిన ఆమె తన సొంత నిధులతో వంతెన నిర్మించారు. నాతవరం మండలంలోని వైబీ అగ్రహారం ఊరగెడ్డపై సర్పంచ్ కోసూరి విజయ నిర్మించిన వంతెన గ్రామస్తుల వెతలను తొలగించింది. వారి మన్ననలు పొందేలా చేసింది.



సర్పంచ్ సొంత నిధులతో వేసిన వంతెన రోడ్డు

- సొంత నిధులతో వంతెన నిర్మాణం
- మండల కేంద్రానికి 5 కి.మీ. తగ్గిన దూరం
- ప్రజల మన్ననలు పొందుతున్న సర్పంచ్ విజయ



నాతవరం: మండలంలోని వైబీ అగ్రహారం పంచాయతీకి దశాబ్దాలుగా సరైన రోడ్డు సదుపాయం లేదు. ఆటోలు, ప్రైవేట్ వాహనాలు తప్ప ఆర్టీసీ బస్సు సౌకర్యం లేనే లేదు. ఈ పంచాయతీ మొదటి నుంచీ టీడీపీకి కంచుకోట. టీడీపీ మండల అధ్యక్షుడే ఈ గ్రామానికి 15 ఏళ్లగా సర్పంచ్. అంతటి ప్రాధాన్యత ఉన్న ఈ పంచాయతీని ఈసారి ఎమ్మెల్యే పెట్ల ఉమా శంకర్ గణేష్ ఆశీస్సులతో కోసూరి విజయ గెలిచారు. ఇంతటి నమ్మకాన్నిచ్చిన పంచాయతీ ప్రజలకు జీవితాంతం గుర్తుండిపోయే మంచి పని చేయాలని సర్పంచ్ విజయ, ఆమె భర్త బుజ్జి నిర్ణయించుకున్నారు.

5 కి.మీ. దూరం తగ్గింది

దీంతో గ్రామానికి అనుకుని ఉన్న ఊరగెడ్డపై వంతెన నిర్మిస్తే మండల కేంద్రానికి వెళ్లే దూరం 5 కి.మీ. తగ్గనుండటంతో వంతెన నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. తమ సొంత నిధులు రూ.3.40 లక్షలు వెచ్చించి వంతెనతోపాటు, అనుసంధాన రోడ్డును పూర్తి చేశారు. వంతెన అందుబాటులోకి రావడంతో మండల కేంద్రానికి వెళ్లే దూరం, సమయం తగ్గడంతోపాటు, ఈ ప్రాంతంలో సుమారుగా 500 ఎకరాల భూముల్లో రైతుల పండించే వ్యవసాయ ఉత్పత్తులను తరలించేందుకు దగ్గర మార్గం ఏర్పడింది. ఇపుడు ఒకటిన్నర కి.మీ. ప్రయాణిస్తే పంట ఉత్పత్తుల్ని గమ్యస్థానానికి చేరవేయొచ్చు. మరోవైపు నాయుడుపాలెం, మన్యపురట్ల, లింగంపేట, మండల కేంద్రం నాతవరానికి దగ్గర దారి ఏర్పడింది.

పెరిగిన భూముల ధరలు

వంతెన నిర్మాణంతో చుట్టు పక్కల వ్యవసాయ ఉత్పత్తుల తరలింపునకు మార్గం సుగమం కావడంతో ఒక్కసారిగా ఈ ప్రాంత భూముల ధరలు పెరిగిపోయాయి. నేరుగా పంట పొలాల్లోకి వాహనాలు పోయే మార్గం ఏర్పాటయింది. సర్పంచ్ తన సొంత నిధులతో నిర్మించిన వంతెనను ఆర్భాటాలకు తావులేకుండా వార్డు సభ్యులు, గ్రామపెద్దలతోనే ప్రారంభించి, రాకపోకలు సాగించడం గమనార్హం. దీనిపై సర్పంచ్ విజయ సాక్షితో మాట్లాడుతూ తనకు ఎలాంటి ప్రచారం వద్దని, గ్రామస్తుల హృదయాల్లో తాము చేసిన మంచి నిలిచిపోతే చాలన్నారు. రాజకీయాలకు అతీతంగా సంక్షేమ పథకాలు అందిస్తున్న సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి, గ్రామాభివృద్ధికి సహకరిస్తున్న ఎమ్మెల్యే పెట్ల ఉమా శంకర్ గణేష్‌కు కృతజ్ఞతలు తెలిపారు.



వంతెన ప్రారంభిస్తున్న వార్డు సభ్యులు, గ్రామపెద్దలు

క్లుప్తంగా

బాల్కనీ నుంచి పడి వ్యక్తి మృతి


మాధవరావు మృతదేహం

పాయకరావుపేట: పండరీపురానికి చెందిన పెదిరెడ్డి మాధవరావు (32) బాల్కనీ నుంచి పడిపోవడంతో మృతి చెందాడు. ఎస్ఐ బి.జోగారావు తెలిపిన వివరాలివి. మాధవరావు తన ఇంటిపైన బాల్కనీలో ఆదివారం ఉదయం నడుస్తుండగా అకస్మాత్తుగా కళ్లు తిరిగి రెండో అంతస్తు నుంచి కిందకు పడిపోయాడు. తలకు బలమైన గాయం కావడంతో తుని ప్రభుత్వ ఆస్పత్రికి కుటుంబ సభ్యులు తరలించారు. సోమవారం చికిత్స పొందుతూ మృతిచెందాడు. పోస్టుమార్టం నిర్వహించి మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అప్పగించారు. మృతుడి భార్య గంగా శేష ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

గంజాయితో ఇద్దరి అరెస్టు


మాట్లాడుతున్న డీఎస్పీ సుబ్బరాజు

అనకాపల్లి: ఒడిశా రాష్ట్రం నయాగడ్ నుంచి కర్ణాటక రాష్ట్రం బెంగుళూర్ రుక్సాన్ మార్కెట్‌కు గంజాయిని తరలిస్తున్న ఇద్దరు వ్యక్తులను అదుపులోకి తీసుకున్నట్టు డీఎస్పీ వి.సుబ్బరాజు చెప్పారు. తన కార్యాలయంలో సోమవారం జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. పట్టణ ఎస్ఐ వి.సత్యనారాయణకు అందిన సమాచారం మేరకు బైపాస్‌రోడ్డు నూకాంబిక ఆర్చి వద్ద వాహనాలు తనిఖీ చేయగా, అదే దారిలో వెళుతున్న మ్యాక్సీ వ్యాన్‌లో రూ.2.39 లక్షల విలువగల 83 కిలోల గంజాయి బస్తాలు బయటపడ్డాయని డీఎస్పీ తెలిపారు. గంజాయితో పాటు ఒడిశా రాష్ట్రం నయాగడ్ జిల్లా గోహ్లంది గ్రామానికి చెందిన మనోజ్‌కుమార్ పరిద, డ్రైవర్ బిహరి కిశోర్‌ను అదుపులోకి తీసుకొని, వారి వద్ద నుంచి రెండు ఫోన్‌లు, వ్యాన్ స్వాధీనం చేసుకున్నట్టు తెలిపారు. నిందితులను 11వ అడిషనల్ న్యాయమూర్తి ముందు హాజరుపరచగా 14 రోజులు రిమాండ్ విధించినట్టు డీఎస్పీ చెప్పారు. ఇన్‌చార్జి సీఐ ఎ.రవికుమార్, ఎస్ఐలు సింహాచలం పాల్గొన్నారు.

అన్ని రంగాల అభివృద్ధికి విశాఖ అనుకూలం

- ఐటీ శాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్
- ముగిసిన క్రెడాయ్ ఎక్స్‌పో



క్రెడాయ్ ముగింపు సభలో మాట్లాడుతున్న మంత్రి గుడివాడ అమర్‌నాథ్

ఆరిలోవ: విశాఖ నగరంలో అన్ని రంగాల అభివృద్ధికి అవసరమైన మౌలిక సదుపాయాలు అందుబాటులో ఉన్నాయని పరిశ్రమలు, ఐటీ శాఖామంత్రి గుడివాడ అమర్‌నాథ్ తెలిపారు. ఎంవీపీ కాలనీలో గాదిరాజు ప్యాలెస్‌లో మూడు రోజులు పాటు నిర్వహించిన క్రెడాయ్ ఎక్స్‌పో షో సోమవారం ముగిసింది. రియల్ ఎస్టేట్, బ్యాంకులు, ఇంటీరియల్ మెటీరియల్ తదితర వాటికి సంబంధించిన 96 స్టాళ్లు ఏర్పాటు చేశారు.

ముగింపు కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న మంత్రి అమర్‌నాథ్ మాట్లాడుతూ సమాజంలో అన్ని వర్గాల ప్రజలకు ఇళ్లను అందించడంలో క్రెడాయ్ విశాఖపట్నం చాప్టర్ కృషి చేస్తోందన్నారు. వారు చేస్తున్న కృషి ప్రశంసనీయమన్నారు. ఏయూలో ఆర్కిటెక్చర్‌లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులు సలాది సౌమ్య, సోవిత్ ఖడ్కా, జగదీష్ రెడ్డిలకు బీఆర్ రాజు స్మారక అవార్డులను మంత్రి అమర్‌నాథ్ అందజేశారు. దీంతో పాటు వినియోగదారులకు లక్కీ డిప్ నిర్వహించారు. విజేతలకు 5 గ్రాములు బంగారు నాణేలను అందజేశారు. కార్యక్రమంలో క్రెడాయ్ ప్రతినిధులు ధర్మేందర్, కేఎస్ఆర్‌కే రాజు, వి.శ్రీను పాల్గొన్నారు.

రూ.25 లక్షల వరకూ ఆరోగ్యశ్రీ

- పేదల ఆరోగ్యానికి భరోసా
- 4.5 లక్షల స్మార్ట్ కార్డుల పంపిణీకి శ్రీకారం



మహారాణిపేట : పేదల పాలిట వరంగా మారిన డాక్టర్ వైఎస్సార్ ఆరోగ్యశ్రీలో సరికొత్త ఫీచర్లు అందుబాటులోకి వచ్చాయి. పేదలకు సంపూర్ణ ఆరోగ్యాన్ని ఇచ్చే ఆరోగ్యశ్రీ పరిధిని ప్రభుత్వం విస్తరించింది. కుటుంబానికి రూ.25 లక్షల విలువగల ఆరోగ్య సేవలు అందించడానికి ప్రణాళిక రూపొందించింది. ఆరోగ్యశ్రీలో వ్యాధుల సంఖ్య పెంచడంతోపాటు క్యాన్సర్ వంటి వ్యాధులను కూడా చేర్చిన విషయం తెలిసిందే. పేద ప్రజలకు 3,257 రోగాలకు కార్పొరేట్ ఆస్పత్రిలో వైద్యం అందుతోంది. ఆరోగ్యశ్రీ కార్డుంటే రూ.25 లక్షల వైద్యం మనచేతిలో ఉన్నట్టే. ఇప్పటికే కొత్త ఆరోగ్యశ్రీ కార్డులు పంపిణీకి కూడా శ్రీకారం చుట్టింది. మహానేత వైఎస్ రాజశేఖరరెడ్డి ఆరోగ్యశ్రీని ప్రవేశ పెట్టారు. 1,059 వ్యాధులతో శ్రీకారం చుట్టారు. ఈ తర్వాత దశల వారీగా వ్యాధుల సంఖ్య పెంచారు. ఆ తర్వాత అధికారం చేపట్టిన చంద్రబాబు ఆరోగ్యశ్రీని నిర్వీర్యం చేశారు. ఆ తర్వాత అఖండ మెజార్టీతో అధికారం చేపట్టిన వైఎస్ తనయుడు వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి తిరిగి ఆరోగ్యశ్రీకి ప్రాణం పోశారు. ఆరోగ్య శ్రీ పథకంలో అనేక దీర్ఘకాలిక రోగాలతోపాటు మొత్తం 3,257 వ్యాధులను చేర్చారు. ప్రస్తుతం సరికొత్త ఫీచర్లతో వైఎస్సార్ ఆరోగ్యశ్రీ కొత్తకార్డులు పంపిణీకి శ్రీకారం చుట్టారు. మొత్తం జిల్లాలో 4.50 లక్షల కార్డులు ఉన్నాయి. వీటిని దశల వారీగా పంపిణీ చేస్తున్నారు. గ్రామ, వార్డు సచివాలయాల్లో వలంటీర్ల ద్వారా పంపిణీ కార్యక్రమం జరుగుతోంది. పదేళ్లయినా భద్రంగా ఉండేలా కార్డును రూపొందించారు. అలాగే కార్డుకు క్యూ ఆర్ కోడ్ ఉంటుంది. మొబైల్ యాప్ ద్వారా కార్డుదారుడి పూర్తి హెల్త్ రికార్డ్, ఆరోగ్య శ్రీ ద్వారా పొందిన సేవలు, రిపోర్టులు, ఎప్పుడైనా, ఎక్కడి నుంచైనా చూసుకునే విధంగా కార్డు రూపొందించారు. ఆరోగ్యశ్రీ నెట్ వర్కు ఆస్పత్రుల వివరాలు, ఆరోగ్యశ్రీ పరిధిలో ఉండే వ్యాధుల వివరాలు కూడా యాప్‌లో పొందుపరిచారు.

కార్డుల పంపిణీ



వైఎస్సార్ ఆరోగ్య శ్రీ కార్డులను పంపిణీ చేస్తున్నాం. మొత్తం 4.50 లక్షల కార్డులు ఉన్నాయి. సచివాలయం పరిధిలో వలంటీర్లు ద్వారా ఈ కార్డులు పంపిణీ జరుగుతోంది. పేదల ప్రజల కోసం ఉద్దేశించిన ఈ ఆరోగ్య శ్రీ పరిధిలోకి తెలుపు కార్డుదారులందరూ వస్తారు.

– డాక్టర్ కొటకల రాజేష్ కుమార్, ఆరోగ్యశ్రీ సమన్వయకర్త, విశాఖజిల్లా

కల్యాణం.. కమనీయం


కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు


పాల్గొన్న ఉభయదాతలు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి ఆదివారం నిత్యకల్యాణం విశేషంగా జరిగింది. ఆలయ కల్యాణ మండపంలోని వేదికపై స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి,భూదేవిలను అదిష్టింపజేశారు. విష్వక్సేనపూజ, పుణ్యాహవచనం, కంకణధారణ, సంకల్పం, యజ్ఞోపవీతం, జీలకర్రబెల్లం, మాంగల్యధారణ, తలంబ్రాల ఘట్టాలతో కల్యాణం కమనీయంగా నిర్వహించారు. ఉభయదాతలకు స్వామివారి అక్షింతలు, శేషవస్త్రాలు, ప్రసాదం అందజేశారు. ప్రధానార్చకుడు గొడవర్తి శ్రీనివాసాచార్యులు, అర్చకుడు శ్రీకాంతాచార్యులు తదితరులు ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు.

శ్రీరాముడిగా అప్పన్న

సింహాచలం: సింహగిరిపై జరుగుతున్న రాపత్తు ఉత్సవాల్లో భాగంగా మూడోరోజు సోమవారం శ్రీవరాహ లక్ష్మీనృసింహస్వామి రామాలంకారంలో దర్శనమిచ్చారు. స్వామివారి ఉత్సవమూర్తి గోవిందరాజస్వామిని శ్రీరాముడిగా అలంకరించి శ్రీదేవి, భూదేవి సమేతంగా పల్లకీలో అదిష్టింపజేశారు. ఆళ్వారులను వేరే పల్లకీలో వేంచేయజేసి సాయంత్రం సింహగిరి మాడ వీధుల్లో తిరువీధి నిర్వహించారు.

ఆలస్యంగా బయల్దేరిన విశాఖపట్నం-తిరుపతి స్పెషల్

తాటిచెట్లపాలెం: విశాఖపట్నంలో సోమవారం రాత్రి 7.10 గంటలకు బయల్దేరాల్సిన విశాఖపట్నం-తిరుపతి(08583) స్పెషల్ ఎక్స్‌ప్రెస్ రాత్రి 8.20 గంటలకు బయల్దేరింది. లింక్ రైలు రాక ఆలస్యం కారణంగా ఈ రైలు ఆలస్యంగా బయల్దేరినట్లు రైల్వే అధికారులు తెలిపారు.

నేత్రపర్వంగా మార్గశిర మాసోత్సవాలు

కనకమహాలక్ష్మి అమ్మవారికి విశేష పూజలు


వెండి కవచంలో అమ్మవారు

డాబాగార్డెన్స్ (విశాఖ): కనక మహాలక్ష్మి ఆలయంలో మార్గశిర మాసోత్సవాలు కనులపండువగా జరుగుతున్నాయి. 12వ రోజు, సోమవారం అమ్మవారిని అధిక సంఖ్యలో భక్తులు దర్శించుకున్నారు. టౌన్ కొత్తరోడ్డు వరకు క్యూలైన్లలో బారులు తీరారు. అమ్మవారికి విశేష పూజలు చేశారు. అమ్మవారికి ఉదయం 5 నుంచి 6 గంటల వరకు పంచామృతాభిషేకాలు, సహస్ర నామార్చన చేసి, 6 నుంచి 11 గంటల వరకు సర్వదర్శనాలు కల్పించారు. 11.30 నుంచి 12 గంటల వరకు అమ్మవారికి పంచామృతాభిషేకాలు చేశారు. మధ్యాహ్నం 12 నుంచి సాయంత్రం 5.30 గంటల వరకు సర్వదర్శనాలు ఏర్పాటు చేశారు. సాయంత్రం 6 నుంచి 7 గంటల వరకు విశేష పంచామృతాభిషేకాలు, అష్టోత్తర నామార్చన నిర్వహించారు. అమ్మవారిని పలువురు ప్రముఖులు దర్శించుకున్నారు.

- అమ్మవారి త్రికాల పంచామృతాభిషేక సేవలో 28 మంది ఉభయదాతలు పాల్గొన్నారు. మధ్యాహ్నం టౌన్‌కొత్తరోడ్డు సమీపాన గల జగన్నాథస్వామి ఆలయంలో 2 వేల మంది భక్తులకు అన్న సమారాధన నిర్వహించారు. సాయంత్రం ఆలయ ప్రాంగణంలో నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి.

ఆకట్టుకున్న నృత్య ప్రదర్శన

ధర్మప్రచార మాసోత్సవాలు..మార్గశిర మాసోత్సవాలను పురస్కరించుకుని సోమవారం సాయంత్రం కనకమహాలక్ష్మి ఆలయ ప్రాంగణంలో లలిత డ్యాన్స్ అకాడమీ కళాకారిణి ఎం. లలిత నృత్య ప్రదర్శన అలరించింది. మంగళవారం నగరానికి చెందిన చెళ్లపిళ్ల మహర్షి, పాతనగరం రాజప్పనాయుడు వీధి ఆనందకుమార్‌చే బుర్రకథ ఏర్పాటు చేసినట్టు ఈవో శిరీష తెలిపారు.

మృతుడి వివరాలు లభ్యం

జంగారెడ్డిగూడెం రూరల్: మండలంలోని చక్ర దేవరపల్లి ఎర్రకాలువ వద్ద ఆదివారం లభ్యమైన మృతదేహాన్ని అనకాపల్లి జిల్లా నాచవరం మండలం ధర్మవరం గ్రామానికి చెందిన బండి సూరిబాబు (43)గా గుర్తించినట్టు లక్కవరం ఎస్ఐ దుర్గామహేశ్వరరావు చెప్పారు. సోమవారం ఆయన వివరాలను వెల్లడించారు. ధర్మవరానికి చెందిన సూరిబాబుతో పాటు మరో 10 మంది వేగవరంలో పైలి సూర్యనారాయణ చెరకు తోటలో బంటా కూలి పనులు నిర్వహించేందుకు ఇటీవల వచ్చారు. సూరిబాబు అనారోగ్యంతో ఇబ్బంది పడుతున్నాడు. ఇదిలా ఉండగా, ఈ నెల 18వ తేదీ నుంచి సూరిబాబు కనిపించకపోవడంతో బంధువులు గాలింపు చర్యలు చేపట్టారు. ఎర్రకాలువ ప్రాంతంలో వ్యక్తి మృతదేహం లభ్యమైంది. తోటి కూలీలు మృతదేహాన్ని పరిశీలించి సూరిబాబుదిగా గుర్తించారు. ప్రమాదవశాత్తూ ఎర్రకాలువలో జారి పడి మృతి చెంది ఉండవచ్చన్నారు. జంగారెడ్డిగూడెం ప్రభుత్వ ఆస్పత్రిలో పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని బంధువులకు అప్పగించారు. అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ తెలిపారు.

పేకాట శిబిరంపై దాడి

అనకాపల్లి: మండలంలో రేబాక గ్రామంలో పాలిటెక్నిక్ కళాశాల సమీపంలో పేకాట అడుతున్న ఏడుగురు వ్యక్తులను అదుపులోకి తీసుకుని వారి వద్ద నుంచి రూ.6,200 నగదును స్వాధీనం తీసుకున్నట్టు రూరల్ ఎస్ఐ సీహెచ్ నర్సింగరావు సోమవారం చెప్పారు. ముందస్తు సమాచారంతో పేకాట శిబిరంపై దాడి చేయడం జరిగిందని, నిందితులపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ చెప్పారు.

వేటకు వెళ్లి మత్స్యకారుడి మృతి


అప్పన్న

అచ్యుతాపురం: సముద్రంలో వేటకు వెళ్లిన పూడిమడక మత్స్యకారుడు మృతి చెందారు. దీనికి సంబంధించిన వివరాలివి.. పూడిమడక జాలరిపాలేనికి చెందిన ఐదుగురు మత్స్యకారులు ఈ నెల 18న బోటులో సముద్రంలోకి వేటకు వెళ్లారు. తెడ్డు అప్పన్న(62) తోపాటు కొండబాబు, పోలరాజు, కాసుబాబు, శ్రీనులు వేటకు వెళ్లి 24వ తేదీ రాత్రి తిరిగి బయలుదేరారు. అయితే బోటు తిరగబడడంతో అప్పన్న మృతి చెందారు. మృతుని తోపాటు, నలుగురు మత్స్యకారులు 25వ తేదీ ఉదయం 8 గంటలకు ఒడ్డుకు చేరుకున్నారు. మృతునికి ఇద్దరు భార్యలు, ఆరుగురు పిల్లలు ఉన్నారు.

బహుముఖ ప్రజ్ఞాశాలి వాజ్‌పేయి


మహిళలకు చీరలు పంపిణీ చేస్తున్న ఎంపీ జీవీఎల్

మహారాణిపేట (విశాఖ): మాజీ ప్రధాని వాజ్‌పేయి బహుముఖ ప్రజ్ఞాశాలి అని నేతలు స్మరించుకున్నారు. వాజ్‌పేయి జయంతిని పురస్కరించుకుని బీజేపీ మైనార్టీ మోర్చా నాయకుడు ఒ. ఆల్బర్ట్ ఆధ్వర్యంలో అఫీషియల్ కాలనీలో నిర్వహించిన కార్యక్రమానికి ఎంపీ జీవీఎస్ నరసింహారావు ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. వాజ్‌పేయి చిత్రపటానికి పూల మాల వేసి ఘన నివాళులర్పించారు. ఎంపీ మాట్లాడుతూ వాజ్‌పేయి పుట్టినరోజును సుపరిపాలన దినోత్సవంగా జరుపుకోవడం హర్షణీయమన్నారు. కార్యక్రమంలో బీజేపీ దక్షిణ నియోజకవర్గ కన్వీనర్ అత్తిలి శంకరరావు, ఏపీ బీజేపీ రాష్ట్ర వైద్య విభాగ కన్వీనర్ రూపాకుల రవికుమార్, రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు ఉప్పాడ అప్పారావు, పాలూరి కృష్ణారావు, తులసీరామ్, రామ్ కుమార్, సుహాసిని ఆనంద్ తదితరులు పాల్గొన్నారు. ఎంపీ జీవీఎల్ చేతుల మీదుగా మహిళలకు చీరలు పంపిణీ చేశారు. అనంతరం క్రిస్మస్ కేక్ కట్ చేసి, అందరికీ శుభాకాంక్షలు తెలిపారు.

స్టీల్‌ప్లాంట్ పరిరక్షణ అందరి బాధ్యత


1047వ రోజు ఉక్కు దీక్షలో సంస్థను ఉద్దేశించి మాట్లాడుతున్న పోరాట కమిటీ నాయకులు

కూర్మన్నపాలెం: సర్వోన్నతమైన దేశ ఆర్థిక ప్రగతికి కార్మికులే కీలకమని, అటువంటి కార్మికులను పట్టించుకోకుండా కేంద్ర ప్రభుత్వం తన ఇష్టానుసారం ప్రభుత్వరంగ సంస్థలను ప్రైవేట్ వ్యక్తులకు అమ్ముకుంటూ పోవడం సరికాదని ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ నాయకులు అన్నారు. కార్మికులను విస్మరించిన ఏ ప్రభుత్వం బాగుపడలేదని విమర్శించారు. కూర్మన్నపాలెం కూడలిలోని స్టీల్‌ప్లాంట్ ఆర్చి వద్ద జరుగుతున్న రిలే నిరాహార దీక్షల్లో సోమవారం, 1047వ రోజు సంస్థకు చెందిన డబ్ల్యూఎండీ, యుటిలిటీ, ఏడీఎం, టీఏ, టీటీఐ విభాగ కార్మికులు పాల్గొని, ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం స్టీల్‌ప్లాంట్‌ను 100 శాతం అమ్మాలనే నిర్ణయాన్ని తక్షణమే విరమించుకోవాలన్నారు. కార్మికులకు ఆర్థిక, సామాజిక న్యాయం చేస్తున్న స్టీల్‌ప్లాంట్‌ను కాపాడుకోవడానికి రాష్ట్రంలోని ప్రజలందరూ అనేక రూపాల్లో ఆందోళనలు చేయాల్సిన సమయం ఆసన్నమైందన్నారు. విశాఖ ఉక్కు పరిశ్రమను ప్రభుత్వరంగంలోనే కొనసాగిస్తామని ప్రధాని స్పష్టమైన ప్రకటన చేయాలని, లేనిపక్షంలో ఆందోళనలను మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో పోరాట కమిటీ నాయకులు, ఇతర కార్మికులు పాల్గొన్నారు.

విమానాశ్రయంలో క్రిస్మస్ సొబగులు


విశాఖ విమానాశ్రయంలో డెకరేషన్


టెర్మినల్ లోపల ప్రత్యేకంగా అలంకరించిన దృశ్యం

గోపాలపట్నం: క్రిస్మస్ సందర్భంగా విశాఖ విమానాశ్రయాన్ని సుందరంగా తీర్చిదిద్దారు. విమానాశ్రయం టెర్మినల్ లోపల పూలతో అలంకరించారు. అక్కడ ఏర్పాటుచేసిన క్రిస్మస్ ట్రీ ప్రత్యేక ఆకర్షణగా ఉంది. విద్యుత్ దీపకాంతులతో విమానాశ్రయ ధగధగ మెరిసిపోయింది. ప్రయాణికులు ఒకరికొకరు క్రిస్మస్ శుభాకాంక్షలు చెప్పుకున్నారు.

పుస్తకాలే ప్రపంచం

- గ్రూప్ 2కి సన్నద్ధమవుతున్న విద్యార్థులు
- వర్సిటీ పరిసరాల్లో విద్యార్థుల సాధన
- చలిలోనూ..వీధి దీపాల మధ్య చదువులు


స్నాతకోత్సవ మందిరం ప్రాంగణంలో చదువుకుంటున్న విద్యార్థులు


చలిలో స్వెటర్ వేసుకుని చదువుకుంటున్న విద్యార్థి

ఏయూక్యాంపస్: వారు అక్షర నేస్తాలు...పుస్తక ప్రియులు. గ్రామీణ ప్రాంతాల నుంచి వచ్చిన అధికశాతం మంది నిత్యం అక్కడ పుస్తకాలతో మనకు దర్శనమిస్తుంటారు. ఆంధ్రవిశ్వవిద్యాలయం డాక్టర్ వీఎస్ కృష్ణా గ్రంథాలయం, స్నాతకోత్సవ మందిరం, ఆర్ట్స్ కళాశాల పరిసర ప్రాంతాల్లో వీధిదీపాల వద్ద చదువుకుంటూ మనకు కనిపిస్తారు. ప్రభుత్వ కొలువు సాధించాలనే దృఢ సంకల్పంతో వీరు వర్సిటీని వేదికగా చేసుకుని తమ లక్ష్య సాధన కోసం నిత్యం పరిశ్రమిస్తున్నారు.

ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం గ్రూ -2 ఉద్యోగాల భర్తీకి నోటిఫికేషన్ విడుదల చేసింది. ఫిబ్రవరిలో దీనికి సంబంధించిన పరీక్ష జరగనుంది. ఈ నేపథ్యంలో పెద్ద సంఖ్యలో విద్యార్థులు వీటికి దరఖాస్తు చేసుకున్నారు. ఎగ్జిక్యూటివ్, నాన్ ఎగ్జిక్యూటివ్ విభాగాల్లో మొత్తం 899 ఉద్యోగాలు భర్తీ కానున్నాయి. వీటిని సాధించాలనే లక్ష్యంతో వర్సిటీ ప్రాంగణంలో పదుల సంఖ్యలో విద్యార్థిని, విద్యార్థులు పుస్తకాలే ప్రపంచంగా గడుపుతున్నారు.

రోజూ ఒక నిర్దిష్ట ప్రణాళికను సిద్ధం చేసుకుని, సమయం వృథా కాకుండా వీరు పరీక్షకు సన్నద్ధమవుతున్నారు. ఆధునికత సాంకేతికతను సైతం వీరు అందిపుచ్చుకుంటున్నారు. గ్రూప్ 2 పరీక్షకు సిద్ధమవుతూ నిత్యం ఒక నమూనా పరీక్ష (మాక్ టెస్ట్)కు సైతం హాజరవుతున్నారు. తమ సెల్‌ఫోన్ లోనే ప్రత్యేకంగా రుసుము చెల్లించి నిత్యం మాక్ టెస్ట్‌లతో తమ జ్ఞానాన్ని పరీక్షించుకుంటున్నారు. ఆన్‌లైన్ యాప్‌లకు మూడు నెలలు, ఆరునెలలు, ఏడాది కాలానికి ప్రత్యేక రుసుము చెల్లించి పరీక్షలకు హాజరయ్యే అవకాశం కల్పిస్తున్నాయి. మరికొంత మంది ఆన్‌లైన్‌లో నిపుణులు పాఠాలు, సబ్జెక్ట్ నిపుణుల ప్రసంగాలు వింటూ కొత్త విషయాలను తెలుసుకుంటున్నారు. మరికొంత మంది పుస్తకాల్లో ముఖ్యమైన అంశాలను చదివిన వెంటనే నోట్స్ రూపంలో రాసుకుంటున్నారు. ప్రముఖ సంస్థలు ప్రచురించిన స్టడీ మెటీరియల్స్‌ను సైతం స్నేహితుల నుంచి సంగ్రహించుకుని చదువుకుంటున్నారు.

వర్సిటీలో ప్రస్తుతం పీజీ కోర్సులు చేస్తున్న విద్యార్థులతో పాటు, ఇప్పటికే పీజీ, బీఈడీ వంటి కోర్సుల్లో ఏయూలో పూర్తి చేసిన పూర్వ విద్యార్థులు సైతం గ్రూప్ 2 పరీక్షలకు తీవ్రంగా శ్రమిస్తున్నారు. కొంతమంది ప్రైవేటు హాస్టల్స్‌లో ఉంటూ, మరికొంత మంది స్నేహితులతో కలిసి ఇళ్లు అద్దెకు తీసుకుని చదువుకుంటున్నా రు. నెలకు రూ.5 వేల వరకు అద్దెకు, భోజనానికి వెచ్చిస్తూ పరీక్షల కోసం నిత్యం వర్సిటీలో ప్రశాంత వాతావరణంలో చదువుకుంటూ తమ లక్ష్యాన్ని చేరుకునే దిశగా ముందుకు సాగుతున్నారు. సోమవారం క్రిస్మస్ రోజున సైతం రాత్రి చలిలో వీరు పుస్తకాలను వదలకుండా చదువుకుంటూ కనిపించారు. పండుగలు, స్నేహితులు, ఫంక్షన్ల ఇలా అన్నీ పక్కన పెట్టి కేవలం ఉద్యోగం పొందడం లక్ష్యంగా సాధన చేస్తున్నారు.

క్లుప్తంగా

మంత్రి అమర్‌నాథ్‌ను కలిసిన మండల యూత్ అధ్యక్షుడు



మంత్రి అమర్‌నాథ్‌ను కలిసి కృతజ్ఞతలు తెలుపుతున్న సాయికిరణ్

తుమ్మపాల: వైఎస్సార్‌సీపీ మండల యూత్ ప్రెసిడెంట్‌గా నియమితులైన కుంచంగి గ్రామానికి చెందిన పల్లెల సాయి కిరణ్ ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్‌ను మింది గ్రామంలో సోమవారం మర్యాదపూర్వకంగా కలిసి కృతజ్ఞతలు తెలిపారు. పార్టీ తనను గుర్తించి అప్పగించిన బాధ్యతల మేరకు పార్టీ బలోపేతానికి కృషి చేస్తానన్నారు. పార్టీ జిల్లా అధ్యక్షుడు బొడ్డేడ ప్రసాద్, ఏపీ ఇన్‌ల్యాండ్ వాటర్‌వేస్ అథారిటీ చైర్మన్ దంతులూరి దిలీప్‌కుమార్, ఎంపీపీ గొర్లి సూరిబాబు, పార్టీ మండల అధ్యక్షుడు పి.గోవింద, పట్టణ అధ్యక్షుడు మందపాటి జానకిరామరాజు, జిల్లా కార్యదర్శి జాజుల రమేష్, కశింకోట మండల పార్టీ అధ్యక్షుడు మలసాల కిషోర్ తదితరులు పట్టణంలోని పార్టీ కార్యాలయంలో సాయికిరణ్‌ను శాలువాలతో సత్కరించి, శుభాకాంక్షలు తెలిపారు.

వృద్ధాశ్రమంలో భోజనం పంపిణీ



వెంకుపాలెం వృద్ధాశ్రమంలో భోజన ప్యాకెట్లు అందిస్తున్న సంజీవిని సంస్థ సభ్యులు

అనకాపల్లి: సమాజంలో ప్రతి ఒక్కరూ సేవా భావంతో మెలగాలని హిమశేఖర్ కళాశాల ప్రిన్సిపాల్ కె.పరమేష్ అన్నారు. పట్టణంలోని ఎన్టీఆర్ వైద్యాలయంలో రోగులకు, మండలంలోని వెంకుపాలెం వృద్ధాశ్రమంలో వృద్ధులకు సంజీవని స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో సోమవారం పండ్లు, రొట్టెలు, గ్లూకోజ్ ప్యాకెట్లు పంపిణీ చేశారు. సంస్థ అధ్యక్షుడు పి.సురేష్ మాట్లాడుతూ సంఘం తరపున ఇబ్బందుల్లో ఉన్నవారికి సహాయ సహకారాలు అందించడానికి ఎల్లప్పుడూ ముందుంటామన్నారు. అంతకు ముందు వృద్ధాశ్రమంలో వృద్ధులకు భోజనాలు అందించారు. కార్యక్రమంలో సంస్థ సభ్యులు గోపీకృష్ణ, నాగశివ, శేషు, పూర్ణ, మళ్ల సాయి, జగన్, భాగ్యలక్ష్మి, రాధ, రమేష్ పాల్గొన్నారు.

కొనసాగిన అంగన్‌వాడీల నిరసన

కశింకోట: కశింకోటలోని అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయాలు చేపట్టిన సమ్మె 14వ రోజు సోమవారం కొనసాగింది. ఈ సందర్భంగా కిశోర బాలికను ఊయల ఊపుతూ జోలపాట పాడి నిరసన తెలిపారు. తమ వేతనాలు పెంచి, ఉద్యోగ భద్రత కల్పించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ, ఆయాల సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షురాలు మజ్జి నాగశేషు, ప్రతినిధులు కొమ్మోజు దేవిక, రాళ్లపూడి మాధవి, పి.పుష్ప, పి.సత్యవతి, టి.శ్యామల, సీఐటీయూ జిల్లా నాయకుడు దాకారపు శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.



వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుంచి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి విద్యావ్యవస్థలో విప్లవాత్మక మార్పులకు శ్రీకారం చుట్టారు. స్కూళ్లలో ఆంగ్ల మాధ్యమం, నాడు-నేడుతో ఆధునిక సౌకర్యాల కల్పన, హైస్కూల్ ప్లస్, సీబీఎస్ఈ విద్యా బోధన, 8వ తరగతి విద్యార్థులకు ట్యాబ్‌ల పంపిణీ.. ఇలా చాలా మార్పులను తీసుకొచ్చారు. ఈ విధానాలన్నీ సఫలీకృతమవుతున్నాయి. పేద విద్యార్థులకు బాసటగా నిలుస్తున్నాయి. హైస్కూళ్లలో వైవిధ్యమైన ప్లస్‌టూ విధానం విజయవంతం కావడంతో బాలికలు, తల్లిదండ్రులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.



ఈ విద్యార్థిని పేరు యన్నంశెట్టి హేమనందు. కూండ్రం హైస్కూల్ ప్లస్‌లో బైపీసీ ఫస్టియర్ చదువుతోంది. పదో తరగతి వరకు ఊర్లో ఉన్న స్కూల్లోనే చదువుకుంది. గతంలో ఇంటర్ చదవాలంటే అనకాపల్లి పట్టణానికి వెళ్లాల్సిందే. అనకాపల్లికి వెళ్లేందుకు బస్సులు పరిమితంగా ఉన్నాయి. దీంతో ఆటోల్లోనే రాకపోకలు సాగించాలి. పేద విద్యార్థులకు ఇది వ్యయప్రయాసలతో కూడుకున్నది. తను టెన్త్ చదువుకున్న స్కూల్‌నే ఇంటర్ వరకు అప్‌గ్రేడ్ చేయడంతో హేమనందు ఎంతగానో సంతోషిస్తోంది. అనకాపల్లి వెళ్లే ప్రయాస తప్పిందని చెప్తోంది. బాలికల కోసం మండలానికో హైస్కూల్ ప్లస్ ఏర్పాటు చేస్తూ జగన్ మామ తీసుకున్న నిర్ణయానికి కృతజ్ఞతలు తెలిపింది.

బాలికల విద్యకు బాసటగా..



కూండ్రం హైస్కూల్ ప్లస్‌లో బైపీసీ గ్రూప్ విద్యార్థినులు



తరగతి గదిలో బైపీసీ సెకండియర్ విద్యార్థినులు



అనకాపల్లి(యలమంచిలి రూరల్): హైస్కూల్ ప్లస్ విధానంలో బాలికలకు ఉన్న ఊళ్లలోనే ఇంటర్ విద్యను అందించాలన్నది రాష్ట్ర ప్రభుత్వం ఆశయం. ఇందుకు అనుగుణంగా అనకాపల్లి మండలంలోని కూండ్రం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను హైస్కూల్ ప్లస్‌గా ప్రభుత్వం అప్‌గ్రేడ్ చేసింది. 2022-23 విద్యా సంవత్సరంలో ఈ విధానాన్ని అమలు చేసింది. ఈ పాఠశాలలో ఇంటర్ విద్యకు అవసరమైన అన్ని మౌలిక సౌకర్యాలను రాష్ట్ర ప్రభుత్వం కల్పించింది. గతేడాది బైపీసీ గ్రూపులో ప్రవేశాలను ఇక్కడ ప్రారంభించారు. మొత్తం 40 సీట్లను బాలికలకు మాత్రమే కేటాయించారు. ఈ గ్రూపులో సబ్జెక్టుల బోధనకు అధ్యాపకులను సైతం ప్రభుత్వం నియమించింది. ఇక్కడ చదువుతున్న విద్యార్థులకు ప్రభుత్వమే ఉచితంగా పాఠ్యపుస్తకాలు, యూనిఫామ్ అందించింది. ప్రస్తుతం ఈ పాఠశాలలో మొదటి సంవత్సరంలో 20 మంది, ద్వితీయ సంవత్సరంలో 12 మంది బాలికలు ఇంటర్ విద్యను అభ్యసిస్తున్నారు.

ఎంతో ఉపయోగం



పదో తరగతి తరువాత మమ్మల్ని బయటకి పంపాలంటే తల్లిదండ్రులు భయపడేవారు. ఇంటర్ చదవాలంటే అనకాపల్లి వెళ్లాల్సి వచ్చేది. రోజు వెళ్లి రావాలంటే రూ.100 ఖర్చవుతుంది. ఆర్థిక భారంతో పాటు, తీవ్ర వ్యయ ప్రయాసలు పడాల్సివచ్చేది. ప్రస్తుతం అలాంటి పరిస్థితి లేదు. నేను పదో తరగతి చదివిన హైస్కూల్‌లోనే ఇంటర్ విద్య అందుబాటులోకి తేవడంతో ఇక్కడే చేరాను. అమ్మఒడి కూడా వస్తోంది. జగన్ మామయ్య మేలు మర్చిపోలేం.

– మొల్లేటి పూజిత, బైపీసీ ఫస్టియర్

పాఠాలు బాగా చెబుతున్నారు



మా తరగతిలో 12 మంది విద్యార్థులం ఉన్నాం. హైస్కూల్ ప్లస్‌గా అప్‌గ్రేడ్ అయిన మొదటి సంవత్సరం నుంచే అన్ని సబ్జెక్టులకు అధ్యాపకులను నియమించారు. అధ్యాపకులంతా పాఠాలు బాగా చెబుతున్నారు. మా అందరి సందేహాలను ఎప్పటికప్పుడు నివృత్తి చేస్తున్నారు. బాగా అర్థం చెసుకోగలుగుతున్నాం. ఫస్టియర్ అన్ని సబ్జెక్టుల్లో పాసయ్యా. సొంతూరిలోనే కళాశాల ఏర్పాటు చేయడం మాకెంతో మేలు చేసింది. ప్రభుత్వానికి ధన్యవాదాలు.

– గెరటా రాజేశ్వరీ అంజలి, బైపీసీ సెకండియర్

పార్టీ గెలుపు కోసం కృషి చేయాలి



జోసెఫ్ కార్యాలయంలో మంత్రి, ఎంపీ

అనకాపల్లి: రానున్న సార్వత్రిక ఎన్నికల్లో గెలుపు కోసం పార్టీ శ్రేణులు శక్తివంచనలేకుండా కృషి చేయాలని రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్య, ఐటీశాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్ సూచించారు. మండలంలో కొత్తూరు పంచాయతీ పరిధి శారదానగర్ మెయిన్‌రోడ్డులో వైఎస్సార్‌సీపీకి చెందిన జెడ్పీ కోఆప్షన్ సభ్యుడు పెతకంశెట్టి శివసత్యనారాయణ(జోసెఫ్) నూతన కార్యాలయాన్ని సోమవారం ఎంపీ బీవీ సత్యవతితో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ పార్టీశ్రేణులు సీఎం జగన్ గెలుపు కోసం సమష్టిగా పనిచేయాలన్నారు. కార్యక్రమంలో ఏపీఐడబ్ల్యూఏ చైర్మన్ దంతులూరి దిలీప్‌కుమార్, జెడ్పీ వైస్ చైర్మన్ బి.వరాహ సత్యవతి, పార్టీ పట్టణ అధ్యక్షుడు మందపాటి జానకీరామరాజు, ఎంపీపీ గొర్లి సూరిబాబు, పార్టీ మండల అధ్యక్షుడు పెదిశెట్టి గోవింద్, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

నూకాంబిక సన్నిధిలో ఎస్పీ దంపతులు



ఎస్పీ దంపతులకు అమ్మవారి చిత్ర పటం అందిస్తున్న ఆలయ కమిటీ సభ్యులు, జయవీర్

అనకాపల్లి: పట్టణంలోని గవరపాలెం నూకాంబిక అమ్మవారిని జిల్లా ఎస్పీ కేవీ మురళీకృష్ణ దంపతులు సోమవారం దర్శించుకున్నారు. ఆలయ ఈవో బండారు ప్రసాద్, ఆలయ కమిటీ సభ్యులు ఎస్పీకి సాదరస్వాగతం పలికి, అమ్మవారి దర్శనం కల్పించారు. బేడా మండపంలో మురళీకృష్ణ, శిల్ప దంపతులను అర్చకులు ఆశీర్వదించారు. వైఎస్సార్‌సీపీ యువనేత దాడి జయవీర్, కమిటీ సభ్యులు అమ్మవారి చిత్రపటాన్ని ఎస్పీ దంపతులకు అందించి, ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

వాజ్‌పేయికి ఘన నివాళి



వాజ్‌పేయి విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న బీజేపీ నేతలు

అనకాపల్లి: స్థానిక రింగ్ రోడ్డులో మాజీ ప్రధాని వాజ్‌పేయి జయంతి వేడుకలు సోమవారం ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా బీజేపీ జిల్లా అధ్యక్షుడు ద్వారపురెడ్డి పరమేశ్వరరావు కేక్ కట్ చేసి పార్టీ నేతలకు పంపిణీ చేశారు. అంతకు ముందు అక్కడే ఉన్న వాజ్‌పేయి విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో రాష్ట్ర కార్యవర్గ సభ్యులు జీవీ సత్యనారాయణ, కొణతాల రాజాబాబు, కోలపర్తి శ్రీనివాసరావు, పార్టీ నేతలు వుడా రమేష్, కొండబాబు మాస్టారు, గంగుపాం నాగేశ్వరరావు, కశిరెడ్డి శ్రీను, వి.నర్సింగ్‌యాదవ్ పాల్గొన్నారు.



తాళ్లపాలెంలో వాజ్‌పేయి చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న పొన్నగంటి అప్పారావు

కశింకోట: మండలంలోని తాళ్లపాలెంలో మాజీ ప్రధాని అటల్ బిహారీ వాజ్‌పేయి జయంతి కార్యక్రమాన్ని సోమవారం ఘనంగా నిర్వహించారు. బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు పొన్నగంటి అప్పారావు వాజ్‌పేయి చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. స్వీట్లు పంపిణీ చేశారు. ప్రధానిగా వాజ్‌పేయి దేశానికి అందించిన సేవలను ప్రస్తుతించారు. కార్యక్రమంలో బీజేపీ మండలాధ్యక్షుడు కరక సత్యనారాయణ, ప్రధాన కార్యదర్శి అప్పికొండ అప్పారావు, కార్యదర్శి హిందుకూరీ రామకృష్ణరాజు, అసెంబ్లీ విస్తారక్ పప్పు ఈశ్వరరావు, జిల్లా కార్యవర్గ సభ్యుడు అయినాల శ్రీను, అసెంబ్లీ సోషల్ మీడియా కన్వీనర్ పంచాడ గంగరాజు, ఎస్సీ మోర్చా మండల అధ్యక్షుడు ఎస్.నాగరాజు, బూత్ కమిటీ అధ్యక్షుడు తిరుపోళ్ల రామకృష్ణ, ఒమ్మి లోవరాజు పాల్గొన్నారు.

అంబరాన్నంటిన క్రిస్మస్ సంబరాలు



క్రైస్తవ విశ్వాసులకు దీవెనలు అందిస్తున్న మత పెద్దలు



కశింకోటలో ఆంధ్ర కల్వరీ బాప్టిస్టు చర్చిలో వైఎస్సార్‌సీపీ పార్లమెంట్ పరిశీలకుడు రత్నాకర్



క్రైస్తవులతో సందడిగా మారిన చర్చి



విద్యుత్ కాంతుల్లో కథోలిక చర్చి



క్రిస్మస్ ప్రార్థనలకు హాజరైన క్రైస్తవులు

తుమ్మపాల: పట్టణంలోని పలు చర్చిలలో సోమవారం క్రిస్మస్ వేడుకలు అంబరాన్ని అంటాయి. స్థానిక శారదానది బ్రిడ్జి రహదారి ఆర్‌సీఎం చర్చి, ఆర్టీసీ రహదారి కథోలిక చర్చిలలో ఉదయం నుంచి సాయంత్రం వరకు క్రీస్తు బోధనలు, ఏసును కీర్తిస్తూ గీతాలాపన జరిగాయి. క్రిస్మస్ సందర్భంగా ఏర్పాటు చేసిన విద్యుత్ లైటింగ్‌తో చర్చిలు ధగధగలాడాయి. కథోలిక చర్చిలో ఏసు జననం, మేరీ మాత సెట్టింగ్‌లు పలువురిని ఆకట్టుకున్నాయి. చర్చిలకు వచ్చిన వారందరికీ క్రైస్తవ పెద్దలు చాక్లెట్లు, అరటి పండ్లు పంపిణీ చేశారు.

కశింకోట: మండలంలోని జమాదులపాలెంలో క్రిస్మస్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. మార్కెట్ కమిటీ ఉపాధ్యక్షుడు కరక సోమునాయుడు ఇంటి వద్ద జరిగిన కార్యక్రమంలో రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్య శాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్ కేక్ కట్ చేసి, పంపిణీ చేశారు. క్రీస్తు చూపిన శాంతి మార్గాన్ని అనుసరించాలని కోరారు. కార్యక్రమంలో ఏపీఐడబ్ల్యూఏ చైర్మన్ దంతులూరి దిలీప్‌కుమార్, జెడ్పీటీసీ సభ్యుడు దంతులూరి శ్రీధర్‌రాజు, ఎంపీపీ కలగా లక్ష్మి, వైఎస్సార్ సీపీ జిల్లా అధికార ప్రతినిధి మళ్ల బుల్లిబాబు, మార్కెట్ కమిటీ అధ్యక్షుడు గొల్లవిల్లి శ్రీనివాసరావు, వైఎస్సార్‌సీపీ మండలాధ్యక్షుడు మలసాల కిషోర్, సచివాలయ కన్వీనర్ కలగా గున్నయ్యనాయుడు, మండల ప్రధాన కార్యదర్శి కరక శేషు తదితరులు పాల్గొన్నారు.

➡ మండలంలో సోమవారం క్రిస్మస్ పర్వదినాన్ని భక్తి శ్రద్ధలు, ఆనందోత్సాహాలతో క్రైస్తవులు నిర్వహించారు. ఈ సందర్భంగా కశింకోటలోని ఆంధ్ర కల్వరీ బాప్టిస్టు సెంటినరీ చర్చిలో ఉదయం నుంచి ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ఏసుక్రీస్తును కీర్తిస్తూ మహిళలు బృంద గానాలాపన చేశారు. ఆహూతులను అలరించాయి. పాస్టర్ సన్నీజేమ్స్ క్రీస్తు బోధనలు వినిపించారు. వైఎస్సార్‌సీపీ అనకాపల్లి పార్లమెంటు ఎన్నికల పరిశీలకుడు దాడి రత్నాకర్ సందర్శించి చర్చిలో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఏసుక్రీస్తు అందరికి ప్రభువని, ఆయన చూపిన శాంతి మార్గాన్ని అనుసరించాలని ఉద్బోధించారు. పేద వారికి, తోటివారికి తోచిన సహాయం అందించి ఆదుకోవాలన్నారు. చింతలపాలెం చర్చిలో కూడా ప్రార్థనలు చేసి శిథిలావస్థలో ఉన్న చర్చి పునర్నిర్మాణానికి తన వంతు సహకారం అందిస్తానన్నారు. సర్పంచ్ మంత్రి జయరజని, చర్చి కమిటీ అధ్యక్షుడు మంత్రి మోజెస్, నాగేశ్వరరావు, కశింకోట బాలికల హైస్కూలు హెచ్‌ఎం ఎం.ఎస్.స్వర్ణకుమారి, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు మంత్రి పీటర్ వైజ్‌మెన్, ఎంపీటీసీ మాజీ సభ్యులు వేగి దొరబాబు, దాడి కృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

➡ కశింకోట గవరపేటలోని ఏసుక్రీస్తు ప్రార్థనా మందిరంలో పాస్టర్ మూర్తి జేమ్స్ పేదలకు వస్త్రాలు, కేకు పంపిణీ చేశారు. మందిరం సంఘ ప్రతినిధులు కె.శ్యామలరాజు, ఎస్.మధు, కె.వరప్రసాద్, ఎన్.కృపావరం తదితరులు పాల్గొన్నారు.

➡ హౌసింగ్ కాలనీ వద్ద షాలెం మందిరంలో పాస్టర్ షారోన్‌రాజ్ ఆధ్వర్యంలో క్రిస్మస్ ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించి కేకు కట్ చేసి, పంచిపెట్టారు. క్రీస్తును కీర్తిస్తూ మహిళలు పాటలు ఆలపించారు.

➡ జమాదులపాలెంలో మార్కెట్ కమిటీ ఉపాధ్యక్షుడు కరక సోమునాయుడు ఆధ్వర్యంలో క్రిస్మస్ వేడుకలు నిర్వహించారు.

➡ బయ్యవరం, కొత్తపల్లి, తేగాడ, బుచ్చియ్యపేట, పరవాడపాలెం, ఉగ్గినపాలెం, తాళ్లపాలెం, అచ్చెర్ల, జి.భీమవరం, సుందరయ్యపేట, కన్నూరుపాలెం, తీడ, చెరకాం, ఏఎస్ పేట, నరసింగబిల్లి, నూతలగుంటపాలెం, సోమవరం, ఏనుగుతుని, వెదురుపర్తి తదితర గ్రామాల్లోని చర్చిల్లో క్రిస్మస్ సందర్భంగా ప్రత్యేక ప్రార్థనలు జరిపారు.

మండల యూత్ అధ్యక్షులకు ఎంపీ సత్యవతి అభినందన



అప్పారావు, త్రినాథ్‌లను సత్కరిస్తున్న ఎంపీ

అనకాపల్లి: వైఎస్సార్‌సీపీ మండల యువజన విభాగ అధ్యక్షులుగా నియమితులైన ఉగ్గిన నూకఅప్పారావు, వేగి త్రినాథ్‌లను ఎంపీ బీవీ సత్యవతి తన కార్యాలయంలో సోమవారం అభినందన సత్కారం చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పార్టీ యువజన విభాగం పటిష్టతకు చిత్తశుద్ధితో పని చేయాలని సూచించారు. కార్యక్రమంలో గ్రీవెన్స్‌సెల్ జిల్లా అధ్యక్షుడు కాండ్రేగుల విష్ణుమూర్తి, పార్టీ నేతలు పాల్గొన్నారు.

'వై ఏపీ నీడ్స్ జగన్' నేడు

అనకాపల్లి: స్థానిక ఎన్టీఆర్ క్రీడామైదానం సచివాలయం-14 పరిధిలో మంగళవారం మధ్యాహ్నం 3 గంటలకు వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు వైఎస్సార్‌సీపీ పట్టణ అధ్యక్షుడు మందపాటి జానకీరామరాజు సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా రాష్ట్ర మంత్రి గుడివాడ అమర్‌నాథ్, ఎంపీ బీవీ సత్యవతి హాజరుకానున్నట్లు పేర్కొన్నారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, వలంటీర్లు, సచివాలయం పరిధిలో లబ్ధిదారులు హాజరుకావాల్సిందిగా కోరారు.

'ఆసరా' నిధుల జమకు బయోమెట్రిక్ సేకరణ



ఆసరా వర్తింపునకు బయోమెట్రిక్ సేకరిస్తున్న వెలుగు సిబ్బంది

కశింకోట: మండలంలోని పలు గ్రామాల్లో వైఎస్సార్ ఆసరా పథకం కింద నాలుగో విడత రుణ మాఫీ వర్తింపజేయడానికి స్వయం సహాయక సంఘాల సభ్యుల నుంచి బయోమెట్రిక్ సేకరణ సోమవారం నిర్వహించారు. వెలుగు సిబ్బంది కశింకోటలోని దర్గావీధి, తీడ, తేగాడ, నరసింగబిల్లి గ్రామాల్లో బయో మెట్రిక్ వేలిముద్రలు సేకరించారు. వెలుగు ఏపీఎం ఎస్.శ్రీనివాసరావు ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో సిబ్బంది భారతి, మునిరాజు, జోగిరత్నం, మంగలక్ష్మి పాల్గొన్నారు.

అయోధ్య శ్రీరాముని అక్షింతల ప్యాకింగ్



శ్రీరాములోరి అక్షింతలు ప్యాకింగ్ చేస్తున్న మహిళా భక్తుల

అనకాపల్లి: స్థానిక మల్లిమణుగులవారి ఆంజనేయ స్వామి ఆలయంలో సోమవారం అయోధ్య శ్రీరాముని అక్షింతలు మహిళా భక్తులతో ప్యాకింగ్ చేశారు. పట్టణంలో పలు ప్రాంతాల్లో రాములోరి అక్షింతలు పంపిణీకి విశ్వహిందూ పరిషత్ సన్నాహాలు ప్రారంభించింది. మరో రెండురోజుల్లో వేల్పులవీధి, మళ్లవీధి, ఉడ్‌పేట, ఆమంచివారివీధి, అగ్నిమాపక కార్యాలయం రహదారి, కొండపల్లివారివీధి, నర్సింగరావుపేట, చవితినవీధి, బర్మా కాలనీల్లో వీటిని పంపిణీ చేయనున్నట్లు పరిషత్ సభ్యులు తెలిపారు.

డివైడర్‌పై మొక్కలు



డివైడర్ మధ్య ఏర్పాటు చేసిన మొక్కలు

అనకాపల్లి: పట్టణం హరితవనంగా తయారవుతోంది. స్థానిక సుంకరమెట్ట సత్యనారాయణస్వామి ఆలయం నుంచి శారదానది బ్రిడ్జి వరకు గల రహదారి డివైడర్‌పై వివిధ రకాల మొక్కలు సుమారు 3 వేలు నాటారు. పర్యావరణ పరిరక్షణ, పట్టణ సుందరీకరణలో భాగంగా జీవీఎంసీ హార్టికల్చర్ విభాగం ఆధ్వర్యంలో వీటిని ఏర్పాటు చేశారు. దీంతో పట్టణ ప్రధాన రహదారి అంతా పచ్చదనంతో నిండిపోయింది. ఇవి పూర్తి స్థాయిలో పెరిగాక ఈ రహదారి మీదుగా రాకపోకలు సాగించేవారికి మరింత ఆహ్లాదం కలిగించనున్నాయి.

చురుగ్గా బస్ స్టేషన్ రోడ్డు పనులు



బస్ స్టేషన్ రోడ్డును రోలర్‌తో చదును చేస్తున్న దృశ్యం

కశింకోట: స్థానిక ఆర్టీసీ బస్ స్టేషన్‌లో రోడ్డు పునరుద్ధరణ పనులు చురుగ్గా సాగుతున్నాయి. రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్య శాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్ ప్రోత్సాహంతో గుంతలు పడిన రోడ్డును పునరుద్ధరించడంతోపాటు మదుంలు, తహసీల్దార్, ఎంపీడీవో కార్యాలయాలకు వెళ్లే రోడ్లను అభివృద్ధి చేస్తున్నారు. ఈ పనులను వైఎస్సార్‌సీపీ జిల్లా అధికార ప్రతినిధి మళ్ల బుల్లిబాబు సోమవారం పరిశీలించారు. త్వరితగతిన పనుల్ని పూర్తి చేసి, ప్రజల వినియోగంలోకి తీసుకొచ్చేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు.

తగ్గిన ఉల్లి, టమాటా ధరలు

కశింకోట: మండలంలోని తాళ్లపాలెం వారపు సంతలో సోమవారం ఉల్లిపాయ, టమాటా ధరలు తగ్గాయి. టమాటా, ఉల్లిపాయలు కిలో రూ.40 నుంచి రూ.30కి తగ్గి విక్రయాలు సాగాయి. బంగాళాదుంపలు రూ.30, వంకాయ, బెండకాయ, దొండకాయ, కాకరకాయ, బరబాటి రూ.80, చిక్కుడుకాయ రూ.120, బీన్స్ రూ.100కు విక్రయాలు సాగాయి.

అనకాపల్లి సినిమాలు

ఆక్వామెన్(తెలుగు): రాజా	
సలార్	: సత్యనారాయణస్క్రీన్-1
ఆక్వామెన్(తెలుగు-3డీ)	: సత్యనారాయణస్క్రీన్-2
హాయ్ నాన్న	: షిర్డిసాయి
సలార్	: పర్తిసాయి
మంగళవారం	: వెంకటేశ్వర
తికమక తాండ	: శ్రీసత్య
సలార్	: రామచంద్ర

బెల్లం ధరలు



అనకాపల్లి బెల్లం మార్కెట్‌కు సోమవారం 4,870 బెల్లం దిమ్మలు వచ్చాయి.

దిమ్మల రకం	కనిష్ట ధర	గరిష్ట ధర
స్పెషల్ రకం	4,400	5,170
మొదటి రకం	4,550	4,940
రెండో రకం	4,340	4,510
మూడోరకం	4,000	4,380